క్లుప్తంగా

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని వార్డు కౌన్సిలర్ ఉమాశంకర్‌గౌడ్ కమీషనర్ లక్ష్మారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, 37 విద్యుత్‌స్తంభాలు, 20 స్తంభాలకు సంబంధించి లైవ్ కండక్టర్‌తో పాటు సైడ్ ఆరమ్స్ అవసరం ఉన్నాయని ఇది వరకే విద్యుత్ సిబ్బంది గుర్తించి నివేదిక ఇచ్చారన్నారు. ఇందుకోసం నిధులు కేటాయించి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్య విద్యార్థినికి అభినందనలు



జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంజెడ్‌సీ చదువుతూ నీట్ ప్రతిభ చూపి గద్వాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు దక్కించుకున్న కావలి శ్రీవాణిని గురువారం ప్రిన్సిపాల్, అధ్యాపకబృందం అభినందించింది. ప్రిన్సిపాల్ చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీవాణిని శాలువాతో సత్కరించారు. వైద్య విద్యలోనూ రాణించి కళాశాలకు పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ డా.సుకన్య ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి కావలి నర్సింహులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ప్రతిభ చాటాలి



జడ్చర్ల టౌన్: ఎస్‌జీఎఫ్ అండర్ 19 ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన పెద్ద ఆదిరాల జెడ్పీ హైస్కూల్ క్రీడాకారులను గురువారం ప్రార్థన సమయంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఎంపికైన వారిలో విజయలక్ష్మి, శిరీష, అశ్విని స్టాండ్‌బైగా కీర్తన ఉన్నారు. రాష్ట్ర టోర్నీలో పాల్గొని పాఠశాలకు పేరు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య సూచించారు. అభినందించిన వారిలో పీడీ మొయిన్, ఏఏపీసీ చైర్‌పర్సన్ మంజుల ఉన్నారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయండి

మెట్టుగడ్డ: కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వైఖరి నిరసిస్తూ శుక్రవారం నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీసీ సమాజ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ముందుకెళ్లడంలో విఫలమైందని ఎద్దేవా చేశారు. వివిధ రకాలుగా అడ్డంకులు సృష్టించి రిజర్వేషన్ అమలు కాకుండా పిటిషన్లు వేయించి, హైకోర్టు నుంచి స్టే రావడానికి కాంగ్రెస్ వైఖరే కారణమని ఆయన దుయ్యబట్టారు. జిల్లాలోని వ్యాపార సముదాయాలు, సినిమా హాళ్లు, విద్యాసంస్థలు, స్వచ్ఛందంగా మూసేసి బీసీలు నిర్వహించే బంద్‌కు సహకరించాలని కోరారు. అన్ని పార్టీల బీసీ నాయకులు, కుల సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

'బీసీల నోటి కాడి ముద్ద లాక్కోవద్దు'

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీఓ 9 కొట్టివేయాలని కోర్టుకు పోయిన రెడ్డి జాగృతి నేతల తీరును తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్ గురువారం ఓ ప్రకటనలో ఖండించారు. బీసీల నోటి కాడికి వచ్చిన ముద్దను లాక్కోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ 9 తో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు అవుతుందనుకున్న బీసీ సమాజానికి నిరాశ మిగిలిందని వాపోయారు.

బీసీలకు అవమానం

మెట్టుగడ్డ: కాంగ్రెస్ పార్టీ అవగాహన లోపంతో యావత్ తెలంగాణలోని బీసీలను అవమానపర్చిందని బీసీ మేధావుల ఫోరం కార్యదర్శి ఎన్ ప్రభాకర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. గురువారం హైకోర్టులో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుపై స్టే ఇవ్వడం కాంగ్రెస్ పార్టీ చేతకానితనానికి నిదర్శనమని అన్నారు. బీసీలకు అడుగడుగునా అవమానాలే ఎదురవుతున్నాయని, కాంగ్రెస్‌కు తగిన రీతిలో త్వరలోనే బుద్ధి చెబుతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ బీసీలను అడ్డం పెట్టుకొని ఆడుతున్న డ్రామాలు ఇకనైనా ఆపాలని హితవు పలికారు.

జల దిగ్బంధంలో గ్రామాలు



చెన్నరెడ్డిపల్లి సమీపంలో గ్రామస్తుల సాయంతో రోడ్డు దాటుతున్న విద్యార్థులు

నవాబుపేట: మండలంలో కుండపోత వర్షం కురవడంతో గ్రామాలన్నీ జల దిగ్బంధంలో ఉన్నాయి. ఉదయం వేసవిని తలపించే ఎండలు కాసి ఒక్కసారిగా మధ్యాహ్నం 3 గంటల నుంచి దట్టమైన మేఘాలు కమ్ముకొని భారీ వర్షం కురిసింది. దాదాపుగా 3 గంటల పాటు ఏకదాటిగా వర్షం కురవటంతో రోడ్లన్నీ జలమయమై రాకపోకలు నిలిపివేశాయి. గ్రామాల్లో ఇళ్లు, రోడ్లు నీటితో నిండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నవాబుపేటలో తాళ్ల వాగు రోడ్డుపై పారడంతో మహబుబ్‌నగర్‌కు రెండు గంటల పాటు రాకపోకలు నిలిచాయి. అలాగే రుద్రారంలో వాగు నిండి నీరు గ్రామంలోకి చేరటంతో రోడ్లు మొత్తం వాగుల పారుతూ ఇళ్లను ముంచెత్తాయి. దీంతో గ్రామంలో సైతం ప్రజలు ట్రాక్టర్ల ద్వారా రాకపోకలు సాగించే పరిస్థితి దాపురించింది. చెన్నరెడ్డిపల్లి గేట్ వద్ద వాగు ఉధృతంగా పారడంతో రాకపోకలు నిలిచిపోగా.. గ్రామస్తులు విద్యార్థులను కష్టంగా రోడ్డు దాటించారు. అలాగే కాకర్లపహడ్‌లో వాగు పారుతూ రాకపోకలు నిలిచిపోయాయి. లింగంపల్లి, కాకర్జాల్, దయాపంతులపల్లి గ్రామాల్లో నీరు చెరువులను తలపించేలా పారుతూ జన జీవనం స్తంభింపచేసింది.



నవాబుపేటలో కురిసిన వానకు పొంగిపొర్లుతున్న తాళ్లవాగు

ఫ్లైఓవర్‌పై వెళ్లేది ఎలా?



అప్పన్నపల్లి ఫ్లైఓవర్‌పై ప్రమాదానికి గురైన ఆటో.. చిన్నారులకు తప్పిన ప్రమాదం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రస్తుత సీజన్‌లో కురుస్తున్న వర్షాలకు స్థానిక అప్పన్నపల్లిలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడ్డాయి. రెండు నెలలైనా అటు ఆర్‌అండ్‌బీ, ఇటు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. తాజాగా గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఈ ఫ్లైఓవర్‌పై నుంచి వెళ్తున్న ఓ ఆటో బోల్తాపడింది. అందులో ఉన్న చిన్నారులు, కుటుంబ సభ్యులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ముఖ్యంగా బైక్‌లు, ఆటోల్లో వెళ్తున్న వారికి ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చివేయాలని వారు కోరుతున్నారు.



జిల్లా కేంద్రంలో రాయిచూర్ రోడ్డు..




సుభాష్‌నగర్‌లోని ఓ వీధిలో ఇదీ పరిస్థితి..

అలుగు పారుతున్న కిష్టారం చెరువు

జడ్చర్ల టౌన్: మండలంలోని కిష్టారం పోతురెడ్డి చెరువు గురువారం ఉదయం నుంచి అలుగు పారుతోంది. మూడేళ్ల తరువాత చెరువు అలుగు పారుతుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువు అలుగు పారుతుండడంతో కిష్టారం నుంచి కారూరు, అంబటాపూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలుగు వరదనీటికి రోడ్డు తెగిపోవటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

అలుగు పారుతున్న కిష్టారం పోతురెడ్డి చెరువు



బడుగుల అభ్యున్నతికి కృషి



కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో మాన్యశ్రీ కాన్షీరాం జయంతిని పురస్కరించుకొని గురువారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ కుమారస్వామి మాట్లాడుతూ కాన్షీరాం చదువుకునే రోజుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేయాలని నిర్ణయించుకుని, దేశ వ్యాప్తంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు తిరిగారని, బహుజన సమాజ్‌వాదీ పార్టీని అన్ని రాష్ట్రాల్లో గెలిపించేందుకు కృషి చేశారన్నారు. పెళ్లి కూడా చేసుకోకుండా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం కాన్షీరాం పరితపించారని కొనియాడారు. ఆయనను నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, అధ్యాపకులు కిషోర్, లా కళాశాల ప్రిన్సిపాల్ మాలవి, భూమయ్య, రాజ్‌కుమార్, ప్రదీప్, పర్వతాలు, శైలేష్, జిమ్మికార్టన్, కల్పన, శ్రీలత, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

రూ.4.50 లక్షల చెక్కు అందజేత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలోని హబీబ్‌నగర్‌కు చెందిన జహంగీర్ పది నెలల క్రితం రాయిచూర్ రోడ్డులో డివైడర్‌పై ఉన్న హైమాస్ట్ లైట్ల కేబుల్ తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కాగా.. బాధిత కుటుంబానికి విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన రూ.4.50 లక్షల విలువ జేసీ చెక్కును గురువారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు ఎస్.వినోద్‌కుమార్, అజ్మత్‌అలీ, మాజీ కౌన్సిలర్లు సాదతుల్లా, రషీద్, మైబు తదితరులు పాల్గొన్నారు.

శునకం.. భయానకం

ఏ గల్లీకెళ్లినా మందలుగా భౌభౌలు! వేచి ఉంటాయి.. వెంటపడతాయి



ఎల్‌బీ వీధిలో కుక్కల మంద

- జడ్చర్ల మున్సిపాలిటీలో పెరిగిన కుక్కల బెడద
- భయాందోళనలో విద్యార్థులు, ఉద్యోగులు
- నిరుపయోగంగా ఏబీసీ సెంటర్

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో కొద్దిరోజులుగా కుక్కల బెడద అధికమవుతుంది. కుక్కల నియంత్రణకు రూ.34లక్షలతో నిర్మించిన యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ (ఏబీసీ) నిరుపయోగంగా మారడంతో కుక్కల బెడద నియంత్రణకు ఆస్కారం లేకుండా పోయింది. ప్రధాన రోడ్లతోపాటు ఏకాలనీకి వెళ్లినా కుక్కల సమస్య వేధిస్తుంది. కుక్కల బెడదతో ఇంట్లోనుంచి చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఏ గల్లీకి వెళ్లినా మందలుగా కుక్కలు సంచరిస్తూ స్వాగతం పలుకుతుంటాయి. వాటిని చూసి రోడ్లపైకి రావాలంటేనే భయం వేస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎల్‌బీ స్ట్రీట్, గాంధీనగర్, కల్వకుర్తి రోడ్డు, కావేరమ్మపేట, గౌరీశంకర్‌కాలనీ, సత్యనారాయణస్వామి ఆలయం, నిమ్మబావిగడ్డ, లక్ష్మీవేంకటేశ్వర ఎంప్లాయిస్ కాలనీతోపాటు ఎక్కడ చూసినా కుక్కల బెడద వెంటాడుతుంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఫార్మ కంపెనీలకు వెళ్లే ఉద్యోగులు కుక్కల భయంతో కర్రలు చేతపట్టుకుని రోడ్డుపైకి వస్తున్నారు. కంపెనీల్లో విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్తుంటే ఏ వైపు నుంచి కుక్కలు వచ్చి మీదపడతాయో అన్న భయాందోళనలో నడుస్తుంటారు. ఇక ఉదయం వాకింగ్ వెళ్లే వారిని సైతం కుక్కలు వదలటం లేదు. జూలై నెలలో ఇందిరానగర్ కాలనీలో కనిపించిన వారందరిపై కుక్క దాడి చేసి గాయపర్చిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి నెలలోనూ కుక్కల దాడిలో కొందరు క్షతగాత్రులయ్యారు. వీరి ఆవేదన అరణ్య రోధనగానే మిగిలి పోయింది. వాస్తవానికి జూలైలో మున్సిపాలిటీ పరిధిలో రెండురోజుల పాటు కుక్కలను తరలించేందుకు చర్యలు తీసుకున్నా అవి సత్ఫలితాలు ఇవ్వలేదు.

నిరుపయోగంగా ఏబీసీ సెంటర్

కుక్కల నియంత్రకు మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు జయప్రకాశ్‌నగర్‌లో రూ.34లక్షలతో ఏబీసీ సెంటర్ భవనం నిర్మించారు. ఇందులో కుక్కలకు ఆపరేషన్ చేయాల్సి ఉంది. ఇందుకుగాను స్వతంత్ర ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారు. అయినప్పటికీ నేటికి సెంటర్ వినియోగంలోకి తీసుకురాలేదు. భవనం పూర్తయినా విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో పనిచేయకుండా ఉంది. మున్సిపాలిటీ నిధుల నుంచి విద్యుత్ సౌకర్యం కోసం నిధులు కేటాయింపులు జరిగినా పనులు ప్రారంభం కాలేదు. అదేవిధంగా సెంటర్‌లో విధుల నిర్వహణకు సిబ్బందిని, డాక్టర్‌ను నియమించాల్సి ఉన్నా ఏజెన్సీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో మున్సిపాలిటీలో కుక్కల బెడద అధికమైంది. భవన నిర్మాణానికి కేటాయించిన నిధులు వెచ్చించి ఉంటే మున్సిపాలిటీలో కుక్కల సమస్య పూర్తిగా తీరేది.

రోజూ ఫిర్యాదులే..



మున్సిపాలిటీలో కుక్కల బెడద గుర్చి రోజూ ఫోన్‌లో ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. నియంత్రణకు ఏర్పాటు చేసిన ఏబీసీ సెంటర్ వినియోగంలోకి రాకపోవడంతో సమస్య పెరుగుతుంది. దానిని వినియోగంలోకి తీసుకొచ్చి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. అంతవరకు ఏం చేయాలనేది పాలకవర్గ సభ్యులతో చర్చించి నిర్ణయిస్తాం. కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడేందుకు అన్నివిధాలుగా కృషి చేస్తాం.

– కోనేటి పుష్పలత, చైర్‌పర్సన్, మున్సిపాలిటీ

నామినేషన్ల ప్రక్రియ నిలిపివేత



మహమ్మదాబాద్‌లో జెడ్పీటీసీ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ నవీన్

సాక్షి, నెట్‌వర్క్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గురువారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించారు. ఈ క్రమంలో కలెక్టర్ విజయేందిర బోయితో పాటు అధికారులు నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. మధ్యాహ్నం తర్వాత హైకోర్టు స్టే విధించడంతో నామినేషన్ల స్వీకరణను అధికారులు నిలిపివేశారు.

■ భూత్పూర్ ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీటీసీ, అన్నాసాగర్ క్లస్టర్‌లో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ, ఓటరు లిస్టులను కలెక్టర్ విజయేందిరబోయి పరిశీలించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంరెడ్డి నామినేషన్ల వివరాల గురించి ప్రత్యేక అధికారి వేణుగోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, ఎన్నికల వ్యయ నిర్వహణ అధికారి దివ్య తదితరులు ఉన్నారు.

■ మహమ్మదాబాద్ మండల కేంద్రంతో పాటు నంచర్ల, గాధిర్యాల్‌లో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జెడ్పీటీసీ నామినేషన్ కేంద్రాన్ని ఆర్డీఓ నవీన్ పరిశీలించారు.

■ గండేడ్ మండల కేంద్రంతో పాటు వెన్నాచేడ్, సల్కర్‌పేట్ ఎంపీటీసీ నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గండేడ్ గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న నామినేషన్ కేంద్రాన్ని ఆర్డీఓ నవీన్ సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.



గండేడ్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద వివరాలు ప్రదర్శిస్తున్న అధికారులు

■ గండేడ్ ఎంపీడీఓ కార్యాలయంలో మండల రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా భూగర్భజల వనరుల డీడీ రవిశంకర్ జెడ్పీటీసీ నామినేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఓటరు లిస్టులను అడిషనల్ డీఆర్‌డీఓ ముసాయిదా బేగం, ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జనార్దన్, ఉపాధ్యాయుడు జనార్దన్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఈకేవైసీ పూర్తి చేయాలి



నంచర్లలో ఉపాధి కూలీతో ఈకేవైసీ చేస్తున్న అధికారులు

మహమ్మదాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఎప్పటికప్పుడు వారి ఫొటోతో ఈకేవైసీ చేయించాలని ఏపీడీ ప్రేమలత తెలిపారు. గురువారం మండలంలోని నంచర్ల, గాధిర్యాల్ గ్రామాల్లో ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు చేస్తున్న కేవైసీని పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 6 వేలకు పైగా ఉపాధి కూలీలు ఉన్నారని, అలాంటి వారందరికీ ఫొటోతో అప్డేట్ చేయాలని తెలిపారు. ప్రతిరోజు క్షేత్ర సహాయకులు కూలీల ఇళ్ల వద్దకు వెళ్లి నేరుగా వారి ఫొటోతో అప్డేట్ చేయాలని సూచించారు. అలాగే అన్ని గ్రామాల్లో ఈజీఎస్ పనులను పరిశీలించాలన్నానరు. కార్యక్రమంలో అబుండ్స్‌మెన్ సంతోష్, ఏపీఓ హరిచ్చంద్రుడు, ఎఫ్ఏలు కేశవులు, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి నివాళి



భూత్పూర్: మండలంలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సింగిల్ విండో చైర్మన్ ఆల బాలవర్ధన్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి బాలవర్ధన్‌రెడ్డి చిన్నాన్న. దివంగత మాజీ కేంద్ర మంత్రి సూదిని జైపాల్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ఆల బాలవర్ధన్‌రెడ్డి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి బాధిత కుటుంబానికి సంఘీభావం వ్యక్తం చేశారు.

ఊరించి.. ఉసూరుమనిపించి..



లింగంపల్లిలో నామినేషన్ పత్రాలు చూపిస్తున్న ఎంపీటీసీ అభ్యర్థి

నవాబుపేట: ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు పార్టీలతో పట్టుబట్టి టికెట్లు పొందిన వారు తీరా నామినేషన్ వేద్దామంటే కోర్టు స్టే విధించడంతో వెనుదిరిగారు. గురువారం మధ్యాహ్నం తర్వాత స్టే రావడంతో మండలంలోని కిషన్‌గూడ ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ వేసేందుకు వచ్చిన గిరిజన అభ్యర్థి బుద్ధనాయక్ నామినేషన్ పత్రాలు చూపిస్తూ నిరాశ వెలిబుచ్చాడు. కాగా మండలంలో గురువారం నామినేషన్‌ల ప్రక్రిను జేసీ మదన్‌మోహన్‌నాయక్ పరిశీలించారు. కాగా ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు.

సాదాబైనామాలపై విచారణ



సాదాబైనామాలపై రైతులతో విచారణ చేస్తున్న తహసీల్దార్ ఎల్లయ్య

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాదాబైనామా దరఖాస్తులపై తహసీల్దార్ ఎల్లయ్య విచారణ చేపట్టారు. మండలంలో సాదాబైనామాలపై 190 దరఖాస్తులు రాగా.. ముందుగా దమగ్నాపురం గ్రామ రైతులతో సమావేశమై విచారణ చేట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల భూసమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి చట్టం ద్వారా సాదాబైనామాల కింద రైతులు కొనుగోలు చేసిన భూముల సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు తిరుపతయ్య, క్రాంతికుమార్ తదితరులు ఉన్నారు.

కుంట రోడ్డుకు మరమ్మతు చేయండి



గుంతలతో అధ్వాన్నంగా మారిన మల్లెల పాపయ్యకుంట రోడ్డు

దేవరకద్ర: మున్సిపాలిటీలోని మల్లెల పాపయ్యకుంటపై ఉన్న రహదారికి మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని దళితవాడ నుంచి అండర్‌పాస్ ద్వారా మల్లెల పాపయ్యకుంట రహదారిపై నుంచి అమ్మాపూర్ బీటీ రోడ్డుకు నిత్యం ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలు తిరుగుతుంటాయి. చాలామందికి అనువుగా ఉన్న ఈ రోడ్డు వర్షాల కారణంగా గుంతలు పడి అధ్వాన్నంగా మారింది. అలాగే రోడ్డుకు రెండు వైపులా ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లను తొలగించాలని కోరారు. మట్టిరోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని, చెట్లు తొలగించి రోడ్డును వెడల్పు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

శంకరసముద్రానికి స్వల్పంగా వరద

కొత్తకోట రూరల్: ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు మండల పరిధిలోని కానాయపల్లి గ్రామ శివారులో శంకరసముద్రానికి స్వల్పంగా వరదనీరు వస్తుండటంతో అధికారులు రెండుగేట్లు ఎత్తి కిందకు నీటిని వదిలారు. శంకరసముద్రానికి పై నుంచి 100 క్యూసెక్కుల నీరు వస్తుండగా ప్రాజెక్టుకు 5 గేట్లలో రెండుగేట్లను ఒక ఫీట్ పైకి ఎత్తి 450 క్యూసెక్కుల నీటిని కిందకు వదిలినట్టు ఏఈ మనోజ్‌కుమార్ తెలిపారు. వర్షం కారణంగా శంకరసముద్రంకు వరద నీరు వచ్చే అవకాశం ఉందని, వరద నీరు తగ్గుముఖం పట్టేవరకు ఉన్నతాధికారుల ఆదేశానుసారం ముందస్తు జాగ్రత్తగా ప్రాజెక్టుకు 5 గేట్లలో ప్రస్తుతానికి రెండుగేట్లు ఎత్తినట్టు ఏఈ వెల్లడించారు.